క్లుప్తంగా

హామీలు అమలుచేయాలి

సిరిసిల్లటౌన్: ఆశా కార్యకర్తలకు నష్టం కలిగేలా ప్రభుత్వం తీసుకొచ్చిన పరీక్ష విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఆశాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, ఎలిగేటి రాజశేఖర్, రుచిత, లావణ్య , నందిని, లత తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన భగవద్గీత పఠన తరగతులు

సిరిసిల్లకల్చరల్: వికాస తరంగిణి ఆధ్వర్యంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న భగవద్గీత పఠన శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి.

జెడ్పీ సీఈవో తనిఖీ

బోయినపల్లి : మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం జెడ్పీ సీఈవో ఉమారాణి తనిఖీ చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు.

నియామకం

వేములవాడ: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ లీగల్, ఆర్టీఐ, హ్యూమన్ రైట్స్ కమిటీ రాష్ట్ర జాయింట్ కన్వీనర్‌గా వేములవాడకు చెందిన న్యాయవాది నాయిమా నాసరిని నియమించారు. ఈ మేరకు రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ శుక్రవారం ఉత్తర్వులు అందజేశారు.

పీసీసీ లీగల్‌సెల్ కన్వీనర్‌గా ఇనాయతుల్లా


మహ్మద్ ఇనాయతుల్లా

కోనరావుపేట: మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన మహ్మద్ ఇనాయతుల్లాకు అరుదైన గౌరవం దక్కింది. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లీగల్‌సెల్ కన్వీనర్‌గా నియమితులు కావడంతో గ్రామస్తులు హర్షం వ్య క్తం చేస్తున్నారు. మహ్మద్ ఇనాయతుల్లా ఎంఏ, ఎల్ఎల్‌బీ, బీజీజే చదివి రాష్ట్ర ఉర్దూ అకాడమీ మెంబర్ బోర్డ్ గవర్నర్‌గా, స్పిన్‌ఫెడ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా విద్యావంతుల వేదికలో పనిచేశారు. ప్రస్తుతం హైకోర్టు న్యాయవాదిగా కొనసాగుతున్న ఇనాయతుల్లా పీసీసీ లీగల్ సెల్ కన్వీనర్‌గా నియమితులు కావడంతో సింగిల్‌విండో వైస్‌చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ముస్తాబాద్: సిద్దిపేట జిల్లా పరుశరాంనగర్‌కు చెందిన ఆనందం ముస్తాబాద్‌లో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ ద్వారా ఫోన్‌ను గుర్తించి శుక్రవారం బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగించినట్లు ఐటీ కానిస్టేబుల్ రాజశేఖర్ తెలిపారు.

కాంగ్రెస్‌ది ప్రజాపాలన

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ పార్టీది ప్రజాపాలన అని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య లాంటి అమరుల త్యాగాలు గుర్తిండేలా లోగో ఉండబోతోందన్నారు. నాయకులు వంగ గిరిధర్‌రెడ్డి, పందిళ్ల లింగంగౌడ్, తిరుపతి, పట్టణ అధ్యక్షుడు చెన్ని బాబు, పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కోనరావుపేట: మండలంలోని వెంకట్రావుపేటలో ఉపాధి హామీ పనుల్లో గాయపడిన ఆరుగురికి ఎంపీ బండి సంజయ్ తరఫున రూ.30 వేల ఆర్థికసాయం అందజేశారు. ఇటీవల వెంకట్రావుపేటలో ఉపాధి పనుల్లో మట్టిపెళ్లలు పడి ఒకరు మృతిచెందగా ఆరుగురికి గాయాలయ్యాయి. గాయపడిన సందు చంద్రయ్య, వద్నాల అమృతవ్వ, ఎడ్ల రామవ్వ, పల్లం దేవవ్వ, కర్నాల శ్యామల, కర్నాల లహరికి ఒక్కొక్కరికి రూ. 5వేల చొప్పున అందజేశారు. బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు రామచంద్రం, జిల్లా కార్యదర్శి సురేందర్‌రావు, నాయకులు ఉన్నారు.

చికిత్స పొందుతూ ట్రాక్టర్ డ్రైవర్ మృతి


బుచ్చయ్య(ఫైల్)

ముస్తాబాద్: కూతురి వివాహానికి చేసిన అప్పులు తీరకపోవడంతో మనోవేదనకు గురైన ఓ ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్యయత్నానికి పాల్పడగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు. మండలంలోని నామాపూర్‌కు చెందిన బిట్ల బుచ్చయ్య(50) అనే ట్రాక్టర్ డ్రైవర్ గతనెల 29న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుచ్చయ్య శుక్రవారం మృతిచెందాడు. బుచ్చయ్య ఎనిమిది నెలలక్రితం కూతురు భార్గవి వివాహానికి అప్పులు చేశాడు. సరైన ఉపాధి లేక అప్పులు ఎలా తీర్చేదని మనోవేదనకు గురయ్యాడు. ఈక్రమంలోనే పురుగుల మందుతాగి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బుచ్చయ్య మృతితో భార్య లక్ష్మి, కూతురు భార్గవి రోదనలు మిన్నంటాయి. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వైకుంఠధామాలకు దారేది?

- మండలంలోని ఆరు గ్రామాల్లో ఇదే సమస్య
- నిర్మాణాలు పూర్తయినా వసతులు లేక ఇబ్బంది
- నిధులు మంజూరుచేసి సమస్యను పరిష్కరించాలని డిమాండ్


దుమాలలో దారి లేకుండా నిర్మించిన వైకుంఠధామాలు

ఎల్లారెడ్డిపేట: గత ప్రభుత్వం గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామాల వద్ద సరైన సౌకర్యాలు లేక అంత్యక్రియలు నిర్వహించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణాలు పూర్తయినా వసతులు కల్పించకపోవడంతో ఇక్కట్లు తప్పడం లేదు. మండలంలోని 24 గ్రామాల్లో శ్మశానవాటికలు నిర్మించారు. స్నానాల గదులు, విద్యుత్, నీటివసతి తదితర సమస్యలు నెలకొన్నాయి. రాగట్లపల్లి, నారాయణపూర్, రాచర్ల గుండారం, వెంకటాపూర్, కిష్టునాయక్ తండా బాకూర్‌పల్లి తండాల్లో వైకుంఠధామాలకు వెళ్లేందుకు దారిలేక దూరం నుంచి మృతదేహాలను తీసుకెళ్లాల్సిన పరిస్థితి. వైకుంఠధామాల్లో పూర్తి సదుపాయాలు అందుబాటులోకి కల్పించాలని పలువురు కోరుతున్నారు.

దారి సమస్యలివే..

- రాచర్ల గుండారంలో వైకుంఠధామానికి వెళ్లేందుకు సరైన దారిలేదు. మధ్యలో కల్వర్టు నిర్మిస్తేనే అక్కడి వరకు వెళ్లే పరిస్థితి. కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు కావాల్సి ఉంది.
- వెంకటాపూర్‌లో దారికోసం ప్రధానంగా భూసమస్య ఉంది. భూమిని ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. భూ సమస్య పరిష్కారం అయితేనే దారి ఏర్పాటు చేయొచ్చు.
- రాగట్లపల్లి గ్రామంలో శ్మశానవాటికకు వెళ్లడానికి దారి లేదు. ఊరికి దూరంగా వైకుంఠధామాన్ని నిర్మించి అధికారులు చేతులు దులుపుకున్నారు. ఫలితంగా ఈ సమస్యకు ఎలాంటి పరిష్కారం లభించే అవకాశం లేదు.
- నారాయణపూర్‌లో తాత్కాలికంగా దారిని ఏర్పాటు చేసినా శాశ్వత పరిష్కారం చూపలేదు.
- కిష్టునాయక్ తండా వైకుంఠధామానికి వెళ్లేందుకు బురద రోడ్డు ఉంది. వర్షం పడితే వెళ్లడానికి వీలుండదు. వర్షాకాలంలో ఎవరైనా చనిపోతే వారికి అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు ఇబ్బందులు తప్పడం లేదు.



నారాయణపూర్‌లో వైకుంఠధామానికి వేసిన తాత్కాలిక రోడ్డు

ప్రత్యేక నిధులు కేటాయించాలి

వైకుంఠధామాల్లో నెలకొన్న సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని పలువురు కోరుతున్నారు. భూ సమస్య ఉన్నచోట త్వరగా పరిష్కరించి. వైకుంఠధామాల్లో అన్ని వసతులు కల్పించాలని కోరుతున్నారు.

దారి కల్పించాలి



గ్రామంలో నిర్మించిన వైకుంఠధామానికి అధికారులు సరైన దారి చూపాలి. ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు చేసేందుకు దారిలేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శాశ్వత దారిని చూపి వెకుంఠధామాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి.

– నిమ్మల బాబు, దుమాల

సమస్యను పరిష్కరిస్తాం



మండలంలో ఆరు గ్రామాల్లో వైకుంఠధామాలకు వెళ్లడానికి సరైన రోడ్డు లేదు. కొన్నిచోట్ల భూసమస్య ఉండగా, మరికొన్ని గ్రామాల్లో దారిని ఇవ్వడానికి ఎవరూ ముందుకురావడం లేదు. మంజూరు చేసి దారి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటాం.

– సత్తయ్య, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

వేములవాడ: అంకితభావంతో పనిచేసే వారి సేవలు ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయని ఈవో రామకృష్ణ అన్నారు. రాజన్న ఆలయంలో ఎలక్ట్రికల్ విభాగంలో ఏఈగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన శేఖర్‌ను శుక్రవారం ఆయన ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సంకెపల్లి హరికిషన్, గౌరవాధ్యక్షుడు సీరిగిరి శ్రీరాములు, కార్యదర్శి శ్రీనివాస్, ఈఈ రాజేశ్, ఏఈవో ప్రతాప నవీన్, అర్చకులు నమిలకొండ రాజేశ్వర్, కట్కూరు వెంకన్న, సహచర ఉద్యోగులు శాలువాతో సన్మానించారు.


సన్మానిస్తున్న ఈవో రామకృష్ణ

సన్మానం

ఆర్డీవో కార్యాలయంలో డీఏవోగా పని చేసిన గణేశ్ ఉద్యోగ విరమణ పొందగా గణేశ్– అరుణ దంపతులను అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. తహసీల్దార్లు మహేశ్ కుమార్, శ్రీనివాస్, విజయ్ ప్రకాశ్, సుజాత, శ్రీలత, పుష్పలత, ఫారూఖ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరిట మోసం !

సిరిసిల్లక్రైం: కలెక్టరేట్‌లోని ఓ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగి కొందరికి ప్రభుత్వ ఉద్యోగాలు పెట్టిస్తానని నమ్మబలికి లక్షల్లో దండుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే ఈ తతంగమంతా ఉద్యోగి గతంలో పనిచేసిన చోట చోటుచేసుకుందని, ఇటీవల సిరిసిల్లకు బదిలీ కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన వారు సంబంధితశాఖ చాంబర్‌కు వచ్చి శుక్రవారం ఆరా తీసినట్లు తెలిసింది. సదరు ఉద్యోగి పోలీసు కుటుంబానికి చెందిన ఒకరిని మోసం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఉద్యోగిని పోలీసులకు పట్టించి అందరికీ న్యాయం చేయడానికి వీలుగా అరెస్ట్ వారెంట్‌తో కలెక్టరేట్‌లో తిరుగుతున్నట్లు సమాచారం.

సెస్ కార్యాలయం ఎదుట బైఠాయింపు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రానికి చెందిన ముద్రకోళ్ల సంతోష్ అనే సెస్ వినియోగదారుడు శుక్రవారం సెస్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశాడు. తన విద్యుత్ మీటర్‌పై రూ.25 వేల బకాయి ఉండగా ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా సెస్ అధికారులు ఇంట్లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో సంతోష్ విడతల వారీగా బకాయి చెల్లిస్తానని తెలిపాడు. అయినా సెస్ సిబ్బంది శుక్రవారం ఇంటికి విద్యుత్ కట్‌చేశారు. సంతోష్ మాట్లాడుతూ..గ్రామంలో కొంత మంది పలుకుబడి ఉన్నవారు లక్షల్లో విద్యుత్ బకాయిలు ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. సెస్ కార్యాలయానికి వెళితే సెస్ ఏడీని కలవాలని దాటవేశారన్నారు. సిబ్బంది, అధికారులపై సెస్ ఎండీ తగుచర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని సంతోష్ కోరుతున్నాడు.

చిన్నారులను బడిలో చేర్పించాలి

ముస్తాబాద్: బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా స్వశక్తి సంఘాల మహిళలు కృషి చేయాలని తహసీల్దార్ సురేశ్ అన్నారు. మండల పరిషత్‌లో అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతులు, బడిబాట కార్యక్రమంపై స్వశక్తి సంఘాల మహిళలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఆయా పాఠశాలల్లో జరుగుతున్న పనులను త్వరగా పూర్తిచేసేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పుస్తకాలు, యూనిఫామ్స్, క్వాలిఫైడ్ టీచర్లతో బోధన జరుగుతుందని, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కాగా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పెట్టడం లేదని, పిల్లల్లో క్రమశిక్షణ లోపిస్తోందని గ్రామైక్య సంఘాల లీడర్లు తెలిపారు. నోడల్ ఆఫీసర్ రాజిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సురేశ్, హెడ్‌కానిస్టేబల్ చంద్రశేఖర్, సీసీ శోభన్‌బాబు పాల్గొన్నారు.

12న సినారె వర్ధంతి

వేములవాడరూరల్: ప్రముఖ రచయిత, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత సి. నారాయణరెడ్డి వర్ధంతిని జూన్ 12 నిర్వహించనున్నారు. మండలంలోని ఆయన సొంత గ్రామం హన్మాజీపేటలో జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్రం నుంచి ప్రముఖులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు, గాయకులు, ప్రపంచ పదులు, సినీగీతాలు నిర్వహించనున్నట్లు సుశీల నారాయణరెడ్డి ట్రస్టు ప్రధాన కార్యదర్శి డా.జె.చెన్నయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రతిపాదనలకే పరిమితం

- మామిడిపల్లి– ఎన్గల్ మధ్య రోడ్డులేక ఇబ్బంది
- అవస్థలు పడుతున్న రెండు మండలాల ప్రజలు
- నిధులు మంజూరుచేయాలని విజ్ఞప్తి


అధ్వానంగా మామిడిపల్లి-ఎన్గల్ రహదారి


వర్షాలకు పవహించే వాగు

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లి నుంచి చందుర్తి మండలం ఎన్గల్ వెళ్లే రహదారికి మోక్షం లభించడం లేదు. ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని గత కొన్నేళ్లుగా ఇరుగ్రామాల ప్రజలు కోరుతున్నారు. రెండు గ్రామాల మధ్య రోడ్డు పూర్తయితే చందుర్తి–కోనరావుపేట మండలాల మధ్య దూరం తగ్గనుంది. కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామం నుంచి చందుర్తి మండలం ఎన్గల్ గ్రామానికి మధ్య నాలుగు కిలోమీటర్లు దూరం ఉంటుంది. మామిడిపల్లి నుంచి చందుర్తి మండలం ఎన్గల్, మర్రిగడ్డ, చందుర్తి, జోగాపూర్, మల్యాల గ్రామాలకు వెళ్లాలంటే ఇది చాలా దగ్గర ఉంటుంది.

ఏళ్లుగా ఎదురుచూపులు

కోనరావుపేట మండలం మామిడిపల్లి నుంచి ఎన్గల్‌కు వెళ్లే రోడ్డు నిధుల కోసం రెండుగ్రామాల ప్రజలు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఈ రహదారిని తారురోడ్డుగా మార్చాలని ఎన్నోసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు, ప్రతిపాదనలు సమర్పించినా ఫలితంలేదు. ఇప్పటికైనా ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

తగ్గనున్న దూరభారం

కోనరావుపేట మండలం మామిడిపల్లి– ఎన్గల్ మధ్య రోడ్డు పూర్తయితే రెండు మండలాల మధ్య చాలా దూరం తగ్గుతుంది. మామిడిపల్లి నుంచి నేరుగా ఎన్గల్ గ్రామానికి వెళ్లాలంటే నాలుగు కిలోమీటర్లు ఉంటుంది. రోడ్డు బాగు లేకపోవడంతో వేములవాడ మండలం హన్మాజీపేట గ్రామం మీదుగా వెళ్లాల్సి వస్తోంది. ఈ దారిన వెళితే 12 కిలోమీటర్లు దూరం ఉంటుంది. అదే రహదారి అయితే 8 కి లోమీటర్ల దూరం తగ్గుతుంది. పైగా సర్కిల్ కార్యాలయం చందుర్తి ఏర్పాటు చేయడంతో ఈ రోడ్డుపై వెళ్ల డం తప్పనిసరిగా మారిందని గ్రామస్తులు పేర్కొన్నారు.

నిధులు మంజూరు చేయాలి



మామిడిపల్లి నుంచి ఎన్గల్ గ్రామానికి వెళ్లడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పొలాలకు వెళ్లే రైతులు, కూలీలు వర్షాకాలంలో అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే రెండు మండలాల మధ్య చాలాదూరం తగ్గడంతో పాటు ప్రజలకు ప్రయోజనం కలుగుతుంది. సమయం కూడా ఆదా అవుతుంది. నిధులు మంజూరు చేయాలని కోరుతున్నాం.

– సాసాల మల్లారెడ్డి, మామిడిపల్లి

రాకపోకలకు ఇబ్బంది



కోనరావుపేట మండలాన్ని వేములవాడ సర్కిల్ పరిధిలోంచి చందుర్తి సర్కిల్‌కు మార్చారు. దీంతో మండలంలోని కనగర్తి, నిజామాబాద్, కోనరావుపేట, వెంకట్రావుపేట తదితర గ్రామాల ప్రజలు చందుర్తికి వెళ్లాలంటే ఇదే దారి. ఈ దారిలో వర్షాలు పడితే అసలు వెళ్లరాదు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి తారురోడ్డుగా మార్చాలి.

– జవ్వాజి మల్లయ్య, గీత కార్మికుడు

త్వరలో అందుబాటులోకి మినీస్టేడియం



వేములవాడ రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్


ఎల్లారెడ్డిపేట: ఆది శ్రీనివాస్‌ను కలిసిన బైండ్ల కులస్తులు

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: వేములవాడలో నిర్మిస్తున్న మినీ స్టేడియం త్వరలోనే క్రీడాకారులకు అందుబాటులోకి రానుందని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చెక్కపల్లి గ్రామంలో లయ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న 30 వార్షికోత్సవంలో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా గ్రామీణ స్థాయి ఇన్విటేషన్ కబడ్డీ టోర్నమెంట్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఉపాధ్యాయులు చదువుతో పాటు విద్యార్థులకు క్రీడలపట్ల మెళకువలు నేర్పించాలని సూచించారు. మాజీ సర్పంచ్ జైపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బాల్‌రెడ్డి, శ్రీకుమార్, స్వామి, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేశ్, పీఈటీలు, నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కుల వృత్తులను కాపాడాలి

ఎల్లారెడ్డిపేట: కులవృత్తులను కాపాడాలని కోరుతూ మండలకేంద్రానికి చెందిన బైండ్ల కులవృత్తిదారులు వేములవాడలోని ఆది నివాసంలో కలిసి విన్నవించారు. అనంతరం సిరిసిల్ల కార్యాలయంలో కేకే మహేందర్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. బైండ్ల కులస్తులు అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం గ్రామస్తులు ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ బొట్టుపెట్టి పనిచేసే కుటుంబాలు అని పేర్కొన్నారు.

'సమస్యలు పరిష్కరించండి'

మండలకేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయానికి సంబంధించి నారాయణపూర్ శివారులో ఉన్న ఐదెకరాల్లో బోరు వసతి కల్పించాలని కోరుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీ నివాస్‌ను ఆలయ కమిటీ సభ్యులు విన్నవించారు. వేములవాడలోని తన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏటా జరిగే రథోత్సవానికి భూముల ద్వారా వచ్చే ఆదాయాన్ని వినియోగించుకోవచ్చన్నారు. దేవాదాయశాఖ నుంచి ఆలయ పునర్నిర్మాణానికి రావాల్సిన నిధులు ఇప్పించాలని కోరారు. నాయకులు గడ్డం జితేందర్, గంట వెంకటేశ్‌గౌడ్, ఒగ్గు బాలరాజు, బుచ్చిలింగు, సంతోష్‌గౌడ్ పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలి

ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని కిష్టంపల్లి, డబల్ బెడ్‌రూంలలో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు విన్నవించారు.



ఘనంగా పోచమ్మ బోనాలు

చందుర్తి: మండలకేంద్రంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోచమ్మ బోనాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మున్నూరు కాపు సంఘం సభ్యులు ఇంటికో బోనంతో డప్పుచప్పుళ్ల మధ్య భారీ ఉరేగింపుగా ఆలయానికి తరలివెళ్లారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బోనాల పండుగలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. సనుగుల సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ముస్కు ముకుందరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, మున్నూరు కాపు మండల సంఘం అధ్యక్షుడు దారం చంద్రం, మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు లోలపు శేఖర్, రాచర్ల లక్ష్మీనారాయణ, రాచర్ల సత్యనారాయణ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో కుంకుమ పూజలు


కుంకుమపూజల్లో పాల్గొన్న మహిళలు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని శ్రీ షిరిడీ సాయి బాబా ఆలయ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఉదయం స్థాపిత దేవతాపూజ, అగ్నిప్రతిష్ఠ, గణపతి హవనం, రుద్రాభిషేకం, సాయంత్రం రుద్రహవనం, పంచసూక్త హవనం, మంగళహారతి, పూర్ణహుతి, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో వేద పండితులు గుండయ్యశర్మ, ఆలయ కమిటీ సభ్యులు బొమ్మకంటి భాస్కర్, అల్లాడి మురళి, మధు, తాటిపల్లి సుధాకర్, నాగేందర్, రాజేశం, మహిళలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కొండూరిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: టెస్కాబ్ చైర్మన్ పదవికి రాజీనామా చేసిన కొండూరి రవీందర్‌రావును శుక్రవారం బీఆర్ఎస్ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. కరీంనగర్ డీసీసీబీ అధ్యక్షుడగి స్థాయి నుంచి టెస్కాబ్, నాబ్కాబ్ చైర్మన్‌గా పదవులు పొంది సహకార బ్యాంకులను బలోపేతం చేశారన్నారు. సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్లు అందే సుభాష్, కొండ రమేశ్ గౌడ్, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, నాయకులు బొల్గం రాధాకృష్ణ తదితరులున్నారు.

అరుగురిపై కేసు

చందుర్తి: మండలంలోని నర్సింగపూర్‌కు చెందిన మోహినికుంట శ్రీ మల్లిఖార్జున స్వామి ఆలయానికి భక్తుడు ఇచ్చిన ఆవు, లేగదూడ విక్రయించిన పూజారితో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నక్క గంగాధర్ ఫిర్యాదు మేరకు పూజారి తంబాల భద్రయ్య, ఒగ్గు కళాకారులు కంబాల రాయమల్లయ్య, కంబాల రాజమల్లు, కంబా ల లింగయ్య, పతి ప్రశాంత్, కంబాల మల్లేశంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సహకార రంగంలో విప్లవాత్మక మార్పులు

ముస్తాబాద్: నమ్మిన సిద్ధాంతానికి తానికి కట్టుబడే టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు రాజీనామా చేశారని పోతుగల్ సింగిల్‌విండో చైర్మన్ తన్నీరు బాపురావు అన్నారు. శుక్రవారం బాపురావు మాట్లాడుతూ సహకార రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి రైతులకు ఎన్నో సేవలు అందించారన్నారు.

నియామక పత్రం అందజేత

తంగళ్లపల్లి: మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సత్తు శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం పార్టీ జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నియామక పత్రం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు శివ ప్రసాద్, లింగారెడ్డి, ఎల్లప్ప, భరత్ గౌడ్, మల్లేశం పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో కుళ్లిన కోడిగుడ్లు

ముస్తాబాద్: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం కుళ్లిపోయిన కోడిగుడ్లు పంపిణీ చేయడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తపల్లి అనిల్ తన కుమారుడి పేరిట వచ్చిన కోడిగుడ్లు కుళ్లిపోయాయి. ఇప్పటికీ రెండుసార్లు కుళ్లిపోయిన కోడిగుడ్లు వచ్చాయని అనిల్ పేర్కొన్నాడు. అధికారుల పర్యవేక్షణ లోపంతో నాసిరకం గుడ్లను ఇవ్వడం ద్వారా లబ్ధిదారుల ప్రాణాలకు మీదకు వస్తుందని తెలుపుతున్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరికి గాయాలు

కోనరావుపేట: మండలంలోని నాగారం–మర్తనపేట గ్రామాల మధ్య ద్విచక్రవాహనం అదుపుతప్పి మారుపాక గ్రామానికి చెందిన ముడికె రవికి గాయాలయ్యాయి. గ్రామస్తులు 108కు సమాచారం ఇవ్వగా చికిత్స కోసం అంబులెన్స్‌లో సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బైక్ ఢీకొని వృద్ధుడికి..

సిరిసిల్లక్రైం: పట్టణంలోని సెస్ కార్యాలయం ముందు ప్రధాన రహదారిపై బైక్ ఢీకొనడంతో వృద్ధుడికి గాయాలయ్యాయి. సెస్ కార్యాలయం ముందు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధుడిని బైక్ ఢీకొనడంతో గాయాలయ్యాయి. వృద్ధుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

క్రీడాకారులకు టీషర్ట్స్ పంపిణీ

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలకేంద్రంలో క్రీడాశాఖ సౌజన్యంతో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ క్లబ్‌లో 80మంది క్రీడాకారులకు కరీంనగర్‌లోని రాఘవేంద్ర హాస్పిటల్ వైద్యుడు గాజర్ల శరత్ కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు టీషర్ట్స్ అందించారు. పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా :
9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899